# చిరంజీవి

"తెల్లవారు ఝామునే ఎల్లిపోతూన్నాం రంగన్న తాతా!" రంగన్నతాత కంచంలో నూకల సంకటి పోస్తా అన్నది నర్సమ్మ.

"ఆఁ. పోతోన్నారా? అమ్మా!" నీరసంగాలేచి గోడకు ఆనుకొని కూర్చుంటూ అన్నాడు రంగన్న తాత.

"అవును-తాతా! అంతా ఎల్లిపోతోన్నాం!" అంటూ నర్సమ్మ కంచం రంగన్నతాత దగ్గరకు తోసింది.

"ఎక్కడికి పోతూండారమ్మా?" వంగని మోకాళ్లను భారంగా దగ్గిరకు లాక్కుంటూ నర్సమ్మ ముఖంలోకిచూసి అన్నాడు రంగన్న తాత.

"ఇంకెక్కడికి తాతా? మళ్ళీ మాదేశమే పోతూన్నాం! ఇప్పట్లో ఇక్కడేడాపన్లు దొరికేట్టు లేవంట!" — కంచంలో అంత మిరపకాయ పచ్చడేసి రంగన్నతాత చేతి కందించింది నర్సమ్మ.

తన ఊరూ, తన ఇల్లూ ధ్యాసలో పడిపోయిన నర్సమ్మ దూరంగా చింతచెట్లచాటున మబ్బుల్లో దోబూచులాడుతోన్న చందమామను చూస్తో గడ్డంకింద చెయ్యి మోటించి రంగన్న తాతకు ఎదురగా స్థంభాని కానుకొని కూర్చుంది

నూకల సంకటి వేళ్ళతో కదుపుతూ "ఇయ్యాల్తో దీని క్కూడా ఋణం తీరిపోయింది!" కంచంలోకి చూస్తో అన్నాడు రంగన్న తాత.

"అదేవింటి తాతా!" నర్సమ్మ మనసు చిన్నబోయింది.

చందమామ మబ్బుల చాటుకు పోయింది. వెన్నెల మూగపోయింది. చింతచెట్ల నీడలను భూమి మింగేసింది. పొంగి వస్తూన్న దుఃఖాన్ని నర్సమ్మ గొంతులోనే దిగమింగుకొంది.

రంగన్నతాత బరువుగా కనురెప్ప లెత్తి నర్సమ్మ కళ్ళల్లోకి చూస్తో అన్నాడు—

"నీ ఋణం ఎట్లా తీర్చుకోను తల్లీ!" వృద్ధుడి గొంతు ఆర్ద్రమైంది. కళ్ళు చెమ్మగిల్లాయి. ఎండిపోయిన చంపలపై కన్నీటి బొట్లు జారి కంచంమీద టపటపా పడినై.

"దానికేంముందిలే తాతా! చారెడులోనే వో చిటికెడు! కాసిన్ని గంజినీళ్లు! అంతేగా?" పైట కొంగుతో కళ్లు తుడుచుకొంటూ అన్నది నర్సమ్మ.

"రేపట్నుంచీ ఆ గంజినీళ్ళు మాత్రం పోసే వాళ్ళెవరమ్మా?"—సంకటి రెండు గుటకలువేసి పచ్చడి నాలుక్కు రాసుకొన్నాడు రంగన్న తాత.

"చూడు! తాతా! నువ్వు కూడా మాతోపాటు రాకూడదూ?" మంచినీళ్ళముంత చేతికందిస్తో అడిగింది నర్సమ్మ.

"రావటానికి నా కాళ్ళేవి తల్లీ? ఇహ యీ కాళ్ళు ఆ కాట్లో వంగాల్సిందే!" నీరుచూపి అంటిస్థంభాల్లా వుబ్బిపోయిన కాళ్ళను నిమురుకొంటూ దూరంగా జమ్మిచెట్ల

మాటున మిణుకు మిణుకు మంటోన్న వల్లకాటికేసి దిగులుగా చూశాడు—

రంగన్నతాత వాలకం చూస్తోంటే గుండె చెదరింది నర్సమ్మకు. "అదేవింటి తాతా? అలా చూస్తున్నావ్ ?" తాత భుజం వూపుతూ అడిగింది నర్సమ్మ.

రంగన్నతాత ఏదో పూనినవాడిలా అన్నాడు—

"మా తాత యీ గడ్డమీదే పుట్టాడు! ఇక్కడే మన్నయి పోయాడు! మా అయ్యా యీ నేల మీదే పుట్టాడు. యిక్కడే మన్నయి పోయాడు! నేనూ యీ వూళ్ళోనే పుట్టాను! యిక్కడే—" రంగన్నతాత గొంతు పూడిపోయింది.

.... .... .... ....

అవును! రంగన్న తండ్రి, తాత ముత్తాతలూ ఆ వూళ్లోనే పుట్టి అక్కడే గతించి పోయారు. తాతగారి హయాంలో సొంత భూమీ, సొంత ఇల్లూ వుండేవి. తండ్రి కాలంలో వున్న పొలం కాస్తాపోయి ఇల్లు మాత్రం మిగిలింది. రంగన్న తండ్రికి సొంత గడపల్లోపల కళ్ళు మూసే అదృష్టమైనా మిగిలింది.

పాపం, రంగన్న ఆమాత్రం అదృష్టానికైనా నోచుకోలేదు. వృద్ధాప్యం మీద పడింది. ఉండటానికి ఇల్లులేదు. నడవటానికి కాళ్ళు లేవు; వున్నా లేనట్టే అయింది! కాళ్ళూ, చేతులూ చచ్చుపడిపోయినై! తినడానికి నోరూ, కడుపూ మాత్రం మిగిలివున్నాయి. శరీరం అంతా చచ్చుపడి నిరుపయోగమైనా అవి మాత్రం మిగిలివున్నాయి.

♦ ♦ ♦ ♦

ఇది వొకనాటి మాట—

రంగన్నది ఉక్కులాటి శరీరం! తన చేతుల్తో భూమి బద్దలు కొట్టాడు. ధాన్యరాసుల్ని ఎత్తిపోశాడు.

రంగన్న చేతులు చేయనిపనిలేదు. రంగన్న కాళ్ళ నెర గని చోటులేదు ఆ వూళ్ళో! రంగన్న నెరగని మనిషి లేడు ఆ ప్రాంతంలో.

రంగన్న వయసులో వుండగా భూస్వామి భద్రయ్య గారింట్లో పనికి కుదిరాడు. భద్రయ్య గారింట్లో రంగన్నస్థానం జీతగాడి చోటులాంటిదికాదు. రంగన్న చేసేది జీతగాడి పనే కావొచ్చు! తనూ వొక జీతగాడిననే అభిప్రాయానికి రంగన్న హృదయంలో ఎన్నడూ చోటివ్వలేదు. ఇతర కమతగాళ్ళ తోనూ, కూలీలతోనూ, తన నెప్పుడూ పోల్చుకునేవాడు కాదు. రంగన్న తన స్థానం భద్రయ్యగారి హృదయంలోనే వుందను కునేవాడు.

బతికి చెడ్డ రంగన్న బతుకు మీద భద్రయ్యగారు అపార మైన సానుభూతి చూపించేవాడు. భద్రయ్య రంగన్నను నమ్మి నమ్మించాడు.

భద్రయ్యగారు ఆదరం, అభిమానం, ప్రేమా, విశ్వా సాలతో రంగన్నను శాశ్వతంగా తన ఇంట్లో కట్టివేసు కొన్నాడు.

రంగన్న భద్రయ్యగారింట్లో వో భాగం, కుటుంబంలో వో మనిషీ. యజమానికి నీడగా మసులు కొన్నాడు!

ఆ కుటుంబంతో రంగన్న, వూహాకందని ఏదో బంధ నాలతో బంధించ బడ్డాడు.

రంగన్న భద్రయ్య గారింట్లో చేరేసరికే భార్య చని పోయింది, రెండేళ్ళ కొడుకును భర్తకు వదిలేసి. రంగన్న పసివాణ్ణి గుంటూర్లోవున్న తాతాఅమ్మమ్మలకు అప్పగించాడు. అప్పుడప్పుడు పోయి చూసి వస్తూండేవాడు. మూణ్నెల్లకూ

నాలుగు నెల్లకూ పదీ యిరవై తీసికెళ్ళి కొడుకును సాకుతోన్న ముసలాళ్ళచేతిలో పెట్టి వస్తోండేవాడు.

రంగన్న కొడుకుమీద కొండంత ఆశ పెట్టుకొన్నాడు. బస్తీలో వాణ్ని చదివించి ఏ రెవిన్యూ యినస్పెక్టరో, తాసీల్దారో చేయాలని రంగన్న కోరిక! ఇంకా ఎన్నో గాలిమేడలు నిర్మించుకొన్నాడు.

ఇరవై సంవత్సరాలపాటు రంగన్న విధి విరామం లేకుండా, అహర్నిశలూ భద్రయ్యగారి పొలాలమీద, ఇంట్లోనూ కష్టించి పని చేశాడు.

రంగన్న తరంవాళ్ళు వెనక్కు తప్పుకొన్నారు. కింది తరంవాళ్లు ఎక్కొచ్చారు.

రంగన్న తన భుజాలమీద మోసిన భద్రయ్య కొడుకులు సుబ్బారావూ, రామారావూ పెద్దవాళ్ళయారు. మధ్యాహ్నం అలవాటుగా పడక కుర్చీలో కూర్చునే భద్రయ్యగారికి అలా కూర్చునే వోపికకూడా నశించిపోయి మంచంమీదకు చేరారు.

పెద్ద కొడుకు సుబ్బారావు స్కూలు ఫైనలు తప్పి యింటి దగ్గరే కూర్చున్నాడు. రెండో కొడుకు ఇంజనీరింగ్ పరీక్ష ప్యాసయి సర్వీసులో ప్రవేశించాడు.

అది 1942 సంవత్సరం. భారతదేశ చరిత్రలో ప్రముఖ స్థానాన్ని ఆక్రమించిన సంవత్సరం.

రంగన్న కొడుకు సుబ్బయ్య స్కూలు ఫైనలు పాసయి క్రిస్టియన్ కాలేజిలో ఇన్‌టర్ మొదటి సంవత్సరంలో చేరాడు. రంగన్న తన గుడ్డల కర్చు కూడా మానుకొని, భద్రయ్యగారు వంటిమీద తీసేసిన పాతపంచలు కట్టుకొంటూ, తన కష్టార్జితమంతా తీసుకెళ్ళి కొడుకు చదువుకోసం వినియోగిస్తోన్నాడు.

భద్రయ్యగారి పొలం మాసూళ్ళయాక, రంగన్న డబ్బు తీసుకొని ఒక రోజు గుంటూరు వెళ్ళాడు.

రంగన్న ఇంటి కెళ్ళేసరికి సుబ్బయ్య తన స్నేహితుడు సత్యనారాయణతో కలసి రాజకీయాలు చర్చచేస్తోన్నాడు.

ఆ చర్చలో రంగన్నకు బ్రిటిష్ ప్రభుత్వమూ, గాంధీగారూ, సత్యాగ్రహమూ, ఆ మూడుమాటలు మినహా ఇంకేమీ అర్థంకాలేదు.

"అదుగో! మా నాన్న వచ్చాడోయ్! నాన్నా ఇతను నా క్లాస్ మెట్! వకీలు శేషయ్యగారి కొడుకు!" సత్యనారాయణను తండ్రికి పరిచయం చేశాడు సుబ్బయ్య.

రంగన్న హృదయం పొంగి పోయింది! పెద్ద పెద్దవాళ్ళ కొడుకులతో తన కొడుక్కు పరిచయం! బాగా చదివిస్తే తన కొడుకూ భద్రయ్యగారి కొడుకులా పెద్ద వుద్యోగస్తుడయిపోతాడు! తనింకా రెండు మూడేళ్ళపాటు కష్టపడితే చాలు! కొడుకు వృద్ధిలో కొస్తాడు. తను హాయిగా కాలుమీద క్కాలేసుకొని కూచోవచ్చు! తను పెద్దవాడయి పోతూన్నాడు. శరీరపాటవం కూడా తగ్గిపోతూంది! ఇం కెట్లాగో రెండు మూడు సంవత్సరాలు కష్టపడితే తన కష్టాలు తీరి వొక ఒడ్డెక్కుతాడు. ఎడతెరిపి లేకుండా వచ్చిన ఆలోచనలకు మురిసిపోయి—

"ఐతే చూడు బాబూ! యీ చదువులయాక వుద్యోగంలో ప్రవేశిస్తారు గాదూ? నాకు తెలవక కడుతాగాని మా భద్రయ్యగారి కొడుక్కయినంత పెద్ద వుద్యోగం మీక్కూడా వస్తుందిగా?" అన్నాడు రంగన్న.

'మేం వెధవ వుద్యోగాలు చెయ్యం రంగన్నా!' అన్నాడు సత్యనారాయణ.

"అదేలే! ఇంత చదువూ చదివి ఎదవుద్యోగం ఏం కర్మ! పెద్ద వుద్యోగాలే చెయ్యాలి గాని! అందులో వకీలుగా రణ్వాయివి!" అన్నాడు రంగన్న.

"అదికాదు రంగన్నా! యీ ప్రభుత్వం కింద వుద్యోగం చెయ్యడం అంటే హానిసత్వం అన్నమాట! మేం స్వరాజ్యం కోసం పాటుపడతాం! ముందీ తెల్ల ప్రభుత్వాన్ని పారతోలితే గాని మనకు స్వేచ్ఛలేదు!" ఉపన్యాస ధోరణిలో మొదలు పెట్టాడు సత్యనారాయణ.

"ఏందీ! ఉద్యోగం చెయ్యరూ!" అంటూ విస్తుపోయాడు రంగన్న.

"ఇంకేం వుద్యోగాలు, ఇంకేం చదువులూ? దేశం యావత్తూ అగ్నిపర్వతంలా ఉడికిపోతూంటేను! రేపో మాపో గాంధీగారు క్విట్ ఇండియా నినాదం యివ్వపోతోన్నారు. యువకులంతా యుద్ధరంగంలోకి దూకాలి." ఉద్రేకంగా అన్నాడు సత్యనారాయణ.

"ఏవిటాంఽ సుబ్బన్నా ఇదంతా? నువ్వు కూడా చదువు మానేసి అందులో దిగుతావా?'' అన్నాడు రంగన్న కొడుకుని చూసి. రంగన్న ముఖంలో ఏదో భయం తాలూకు ఛాయలు కమ్ముకున్నై.

"డోన్ట్ టెల్ హిమ్ ఆల్ దట్! హి యీజ్ యఫ్రైడ్ ఆఫ్ ఇట్!" అని సుబ్బన్న సత్యనారాయణకి సైకచేశాడు.

భయవిహ్వాలుడైన రంగన్న ముఖంలోకి చూస్తో సత్యనారాయణ 'ఏంలేదు రంగన్నా! రేపు సొరాజ్యం వచ్చిందంటే మాకు పెద్దపెద్ద ఉద్యోగాలు వస్తాయి. హాయిగా మన దేశాన్ని మనమే పరిపాలించుకోవచ్చు! అప్పుడు మీలాంటి

పెద్దవాళ్ళంతా హాయిగా విశ్రాంతి తీసుకోవచ్చు! ఇలా కష్ట పడాల్సిన బాధ వుండదు! ఒక్కమాటలో చెప్పాలంటే దేశంలో వుండే దరిద్రమే పోతుంది తెల్లవాళ్ళతోపాటు! తెలుసా?" అన్నాడు సత్యనారాయణ తెలివిగా.

"ఓ! అట్లా చెప్పు బాబూ! యీ తెల్లాళ్ళు రాకముందు మా ముత్తాతకు బోలెడంత పొలం వుండేదంట; ఇప్పుడంతా పోయింది చూశా!" అన్నాడు రంగన్న. అన్నాడేగాని మనసులో వో అనుమానం పీకింది. ఇంతవరకూ ఏ తెల్లవాడూ వచ్చి తన పొలం కాని, తన తండ్రిపొలం కానీ లాక్కోలేదు! ఆ లాక్కున్నదేదో నల్లవాడే లాక్కున్నాడు, అదీ మళ్ళీ నల్లవాడికే చేరింది! ఏమైనా తెల్లవాడొచ్చాకే తన భూమి పోయింది! ఎందుకో? ఆ గొడవంతా తనకు తెలియదు! భూమి పోయింది మాత్రం నిజం!

"ఏమో? యీ తెల్లవాళ్ళ ప్రభుత్వంపోతే దేశంలో అందరి కష్టాలు తీరతాయి కాబోలు! చిన్నవాళ్ళయితే మాత్రమేం చదువు కొన్నవాళ్ళు! వాళ్ళమాట పూర్తిగా కొట్టివేయకూడదు" అనుకొన్నాడు రంగన్న.

"అయినా మీ కెందుకయ్యా? యీ సొరాజ్యం గొడవ లంతా? పెద్ద పెద్ద నాయకులు నడుముకట్టుకొని పనిచేస్తా వుండారు గదా! కుర్రాళ్ళు మీకేం చేస్తారు! బాగా చదువు చదువుకొని ఉద్యోగాలు చేసుకొండి! ఎంత గొప్ప వుద్యోగంలో వున్నాడో ఆ భద్రయ్యగారి కొడుకుని చూడండి!" అన్నాడు రంగన్న.

"ఏడ్చాడు — వెధవ ఉద్యోగం—భద్రయ్య కొడుకు చేస్తున్నది గులాంగిరి! బానిసవృత్తి! దేశం తెల్లవాడి ఉక్కు

పిడికిళ్ళలోపడి నలిగిపోతూంటే, మేము వాళ్ళకి అడుగులకు మడుగు లొత్తుతూ వుండమంటావా రంగన్నా? ముందు భారతమాతను దాస్యవిముక్తి చేయాలి! అందుకోసం ప్రాణాల నయినా అర్పిస్తాం!"—పిడికిలి బిగించి ఉద్రేకంగా సత్యనారాయణ మాట్లాడుతున్నాడు—

రంగన్న గుండెల్లో రాయిపడ్డట్టయింది! కొంపతీసి వీళ్ళిద్దరూ ఏ అఘాయిత్యపు పనులకు తలపెట్టారో? ప్రభుత్వమంటే మాటలా? లాఠీలూ, తుపాకులు, మిలటరీ వాళ్లూ—

తను కొడుకుమీద పెట్టుకొన్న ఆశలు నిరాశ లవుతాయా? తన కష్టాలు ఏ నాటికీ తీరవా? తను చేసిన శ్రమ అంతా బూడిదలోపోసిన పన్నీరేనా? రంగన్న హృదయంలో కోపం బుసలు కొట్టింది. కళ్లు నిప్పుకణాల్లా మెరిశాయి—

"ఒరే సుబ్బా! కావాలని అట్టాంటి పిచ్చి పనులు చేసేవు జాగ్రత్త! ఆరికేం, కలవోరి అబ్బాయి, ఏమైనా చేస్తాడు! నువ్వు అట్టా చేస్తే అడుక్కుతిన్నా ఎవరూ పెట్టరు! బుద్ధిగా చదువుకో తెలిసిందా? ఇంత ఉద్యోగం దొరికితే ఇద్దరం బతికిపోతాం!" కఠినంగా అన్నాడు రంగన్న.

తండ్రి అలా మాట్లాడటం సుబ్బయ్య ఎప్పుడూ చూడలేదు. తండ్రి వాలకం చూసి భయపడి—

"ఉట్టిదే నాన్న! సత్యం మాటలకేం! యీసారి నేను ఫస్టున ప్యాసవుతాను! ఫస్టున పాసయితే పెద్ద వుద్యోగం ఇస్తారు తెలుసా?"—అన్నాడు సుబ్బయ్య.

రంగన్న కళ్ళు ఆర్ద్రమయినై. తను తొందరపడి కొడుకుని గద్దించాడు. వాడి సంగతి తనకు తెలియదూ? తనమాట

జవ దాటుతాడా? వృద్ధాప్యంలోవున్న తన్ను ఇంకా కష్టపెట్ట డం వాడికి మాత్రం ఇష్టమా?

తేలికపడిన మనస్సుతో గుంటూరునుంచి తిరిగివచ్చాడు రంగన్న.

భద్రయ్యగారు ఇంట్లోకి బయటికి తిరుగుతూ వుండ గానే, కొడుకులకు పెళ్ళిళ్ళుచేయ నిశ్చయించాడు. వయసు భారం మీదపడి తొక్కుతున్నా ఎండిన చేపకొయ్యలా తిరిగి పనిచేస్తూనే వున్నాడు రంగన్న.

రంగన్న పెళ్ళి పందిర్ల దగ్గర్నుంచి అన్ని పనులూ స్వయంగా తనే చేశాడు—

**1940** ఆగస్టు–15.

పెళ్ళి సందడిలో మొలలోతు వుత్సాహంలోవున్న రంగ న్నకు పిడుగులాంటివార్త చేరింది!

సుబ్బయ్య పోలీసు కాల్పుల్లో — గాంధీమైదానంలో మరణించాడు! ఆ రాత్రికి రాత్రీ గుంటూరునుంచి సుబ్బయ్య నేస్తం సత్యనారాయణ రంగన్న కొడుకు మరణవార్తను మోసుకొచ్చాడు. రంగన్న హృదయం బద్దలైంది!

రంగన్న కట్టుకొన్న గాలి మేడలు కూలి పోయినై! ఆశలతో అల్లిన పేకమేడలు రాలిపోయినై! కొడుకు చదువు కుని పెద్దవాడై ఏ తాసిల్దారో ఇంజనీరో అయి సుఖపడతాడను కొన్నాడు! కొడుకు వృద్ధిలోకివచ్చి వుద్ధరిస్తాడని కొండంత ఆశ పెట్టుకొన్నాడు! తనకు దాస్యవిముక్తి ప్రసాదిస్తాడను కొన్న కొడుకు దేశంకోసం ప్రాణాలర్పించాడట! వాడు తన కికలేడు! తన ఆశాజ్యోతి ఆరిపోయింది! తన భవిష్యత్తూ, తన సర్వస్వమూ వాడితోనే అంతరించినై!!

అర్ధరాత్రి పెళ్ళి పందిట్లో అరిటి ఆకులతో అలంకరించిన స్థంభానికి ఆనుకొని నిర్జీవుడిలా కూర్చున్నాడు రంగన్న—

కాలం దొర్లి పోతోంది. రంగన్న శరీరపాటవం సడలి పోతోంది వార్ధక్యం రెక్కలు విప్పుకొని తరముకు వస్తోంది-

పగలంతా ఇంట్లో, పొలంలో చాకిరీ-రాత్రిపూట గొడ్ల చావిట్లో పడుకొని గత స్మృతుల్ని తలుచుకుంటూండేవాడు. భవిష్యత్తు భయంకరంగానూ, గతం మధురంగానూ వుండేది రంగన్నకు. ఊహాలోకంలోపడి కొట్టుకుపోతూ, తన కొడుకు బతికున్నట్టూ, పెద్ద వుద్యోగం చేస్తోన్నట్టూ, తను హాయిగా మంచం మీద నుంచి కాలు కదపకుండా కాలం గడుపుతున్నట్టూ భావిస్తూ, ఆ భావనలే భ్రమలుగా, ఏమేమో తియ్యటి కలలుగా అనుభవిస్తో వుండేవాడు.

భద్రియ్యగారు తన మంచంచుట్టూ మూగివున్న కొడుకుల్నీ, కోడళ్ళనూ, మనుమల్నీ చూసుకొంటూ ఓ నాటి సంధ్య వేళ శాశ్వతంగా కళ్ళు మూశాడు—

భద్రయ్యగారికి అవసానదశలో రంగన్నను గురించి ఆలోచించే తీరికా, అవకాశం వుండి వుండదు. అరవై సంవత్సరాలు బతికినా కొడుకులకు యివ్వాలనుకొన్నంత యివ్వలేక పోయానని, చెప్పాలనుకున్నదంతా చెప్పలేక పోయాననే ఆరాటంతో ప్రాణాలువిడిచిన భద్రియ్య ముసలి రంగన్నకూ ఏమీ చెప్పలేదని, ఇవ్వలేదని అనుకోవడం — భద్రయ్య తపనను సానుభూతితో అర్థంచేసుకుంటే—భావ్యం కాదేమో ? అంత వరకూ వేళకింత తిని, చావిట్లో తలదాచుకొంటున్న రంగన్న బతుకు భద్రయ్య చావుతో దుర్భరం అయింది. ఈనాడు రంగన్న అవ

సరం భద్రయ్య కొడుకుల కెవరికీ లేదు. అయినా, రంగన్న వాళ్ళకు చేయగలిగిందీ చేయగలదీ అంతగా ఏమీ లేదు.

పెద్దాడు సుబ్బారావు ఊళ్ళో ఇల్లు అమ్మేసి, పొలం కౌలుకిచ్చి గుంటూర్లో పొగాకు వ్యాపారం పెట్టాడు. రామారావు ఉద్యోగం వచ్చాక ఇంటి దగ్గర వున్నదే లేదు.

రంగన్న తన వయసునూ, బలాన్ని ధారపోసి ఎవరికి ఊడిగం చేశాడో, ఆ భద్రయ్య ఇప్పుడులేడు. ఏ ఇంటి క్షేమం కోసం స్వార్థరహితంగా పాటుపడ్డాడో ఆ ఇంటి ప్రహారీగోడల దాపుకుపోగేమే హక్కు కూడా రంగన్నకు లేకపోయింది! ఉత్తరపు వీధి చివరలో రోడ్డు పక్కగా ఏనాడో కట్టిన ధాన్యపు కొట్లు వున్నాయి. ఊళ్ళో మోతుబరి ఆసాములంతా ధాన్యం పోసి భీమా చేయించు కొంటారు. ఆ కొట్లముందు వరుసలో కొంత ఖాళీస్థలంవుంది. పనిపాటలు చేసుకోవడానికి దూర ప్రాంతంనుండి వచ్చిన కూలిజనం, బిచ్చగాళ్ళు, గోసాయిలూ మకాం చేస్తూవుంటారు.

రంగన్నా అక్కడికే చేరాడు. ఉన్న ముంతా, కంచం తీసుకుపోయి కొట్లముందరుగులమీద కొంచెం మదుపైన చోటు చూసుకొన్నాడు—

రంగన్న తన అరవై సంవత్సరాల జీవితంలో చూడని ఎన్నో విశేషాల్ను ఆ కొట్లమీద వున్న ఆరునెలల కాలంలో చూశాడు. అనేక రకాలయిన పాటకజనం వచ్చి అక్కడ దిగుతూండేవారు. కొందరు ఒక్కొక్క రాత్రితోనే మకాం ఎత్తివేస్తే కొంతమంది రెండు మూడు నెలలు కూడా వుండేవారు. చీకటి పడేసరికి పిల్లల ఏడ్పులతో పెద్దవాళ్ళ అరుపులతో ఆ ప్రాంతం అంతా "గీ-భా" మంటూండేది.

ఆ మధ్యలో వచ్చి వారం పదిరోజు లుండి వెళ్ళిన గోసాయిలతో పరిచయం చేసుకొన్నాడు రంగన్న. బతికున్న వాళ్ళు సమాధిలోకిపోయి నెత్తిన బండలు పరిపించుకొనే జీవసమాధుల్ని గురించీ, హిమాలయ మూలికల మహత్తు గురించీ వాళ్లు చెప్తుంటే శ్రద్ధగా వినేవాడు. గంజాయి దమ్ముతో పాటు బ్రహ్మంగారి తత్వాలుకూడా రెండు మూడు పట్టుకొన్నాడు.

నిదరపోటువేళల్లో రంగన్న బ్రహ్మంగారి తత్వాలు పాడుకొంటూ, ముసలి కుక్కలా జోగుతూ వోమూల ముడుచుకు పడుకునేవాడు. వాయుస్థంభనచేసి, కపాళం బద్దలు కాగా, ప్రాణవాయువుల్ని పైకి విసిరేసిన ఒకానొక సన్యాసి కథను మననం చేసుకొంటూ, తనూ అలా వాయుస్థంభన చేయగలిగితే ఎంత బావుండునో అనుకునేవాడు!

తనలాటి పాపాత్ములకు అంతపుణ్యం దొరుకుతుందా? రంగన్న కాళ్ళల్లో తిరిగే వోపిక వున్నంతవరకూ ఆ ఇల్లూ, ఈ ఇల్లూ తిరిగి అంత కవళం తెచ్చుకొని కాలం వెళ్ళదీస్తో వున్నాడు—

.... .... .... ....

1947-ఆగస్టు 15-దేశానికి స్వరాజ్యం వచ్చింది! తెల్ల వాళ్ళు తెల్లటోపీవాళ్ళకు రాజ్యభారం అప్పగించి మరీ వెళ్ళి పోయారు—

దేశంలో ఊరూరా పుత్సవాలు జరిగాయి. స్వాతంత్ర్య యోధుల స్మారక చిహ్నాలు నెలకొల్పబడ్డాయి. నాయకులు అధికారాన్ని స్వీకరించారు-

ఊళ్లో జరిగిన సంబరంచూసి రంగన్న ఆనందపడ్డాడు. తెల్లవాడుపోయి నల్లవాడు రాజ్యానికి వచ్చాడన్న వార్త

రంగన్న చెవుల్లో పడింది. ఐతే తన కష్టాలు ఇక తీరిపోయినట్టే! తన కొడుకుచేసిన త్యాగం యీనాటికి ఫలించిందన్నమాట! ఏడీ తన సుబ్బయ్య స్నేహితుడు సత్యనారాయణ? ఎన్నెన్ని మాటలు చెప్పాడు? అవన్నీ నిజం చేస్తాడా? అసలు సత్య నారాయణ బతికివున్నాడా? తన కొడుకు లాగానే తుపాకి దెబ్బకు ఎక్కడైనా మసయి పోయినాడా? లేక సత్యం చెప్పినదంతా అసత్యమా? ఇలా పరిపరివిధాలుగా ఆలోచిస్తో, సత్యం ఎప్పటికైనా వచ్చి తనను చూస్తాడని ఆశలు పెట్టుకొని రంగన్న కాలం గడుపుతున్నాడు.

ఆకలి కడుపులో పేగుల్ని నమిలివేస్తోంది. రంగన్న మృత్యువుకోసం పడిగాపులు కాస్తున్నాడు. వీధుల్లో, రోడ్ల మీద పంచల్లో, కొట్లమీద నివసించేమనుషుల్ని ఆకలి, మృత్యువు వేటకుక్కల్లా వెన్నంటి తరుముతూ వేటాడుతున్నాయి. రంగన్న కళ్ళముందే పిల్లలూ, పెద్దాళ్ళూ, ముసలాళ్ళూ, ఆడ వాళ్ళూ అనేకంగా అసంఖ్యాకంగా చనిపోతున్నారు.

ఆకలితో పసివాళ్ళు చనిపోయినప్పుడళ్ళా రంగన్న ధాన్యపు కొట్లకు వేసివున్న ఇనపతాళాల్ను చూసి పెదవులు కొరుక్కునేవాడు. ఆ కొట్లలోనే వొకప్పుడు తను బస్తాలకొద్దీ ధాన్యాన్నిపోసి తన చేతుల్తోనే తాళాలువేశాడు. కొట్లచెక్కల సందులోంచి తొంగిచూస్తోన్న వడ్లగింజలను వేళ్ళతో గిల్లు తూన్న పిల్లల ఆకలి ముఖాల్ని చూస్తూంటే రంగన్న కడుపు తరుక్కుపోయేది. గుండెలు చెరువయేవి. కొట్లమీదకు వయ సులోవున్న ఆడవాళ్ళు—పాటకజనం — ఎవరయినా దిగితే కొంతమంది యువకులు తోడేళ్ళలా చూస్తో ఆ చుట్టుపక్కలే తిరిగేవాళ్ళు.

రాత్రిళ్ళు కొంతమంది అనాధల ఆకలి శరీరాల్ని యీ తోడేళ్ళు వశం చేసుకోవడం రంగన్న తన కళ్ళతో చూశాడు.

దేశంలో అలజడి ప్రారంభ మయింది. గ్రామాల్లో దెబ్బలాటలూ, దొమ్మీలుసాగినై. ఏదో ఒక వూళ్లో ప్రతి రోజూ పోలీసుకాల్పులూ, మరణాలూ జరుగుతున్నాయి.

రంగన్నకు తన కొడుకు చనిపోయిననాటి పరిస్థితులు గుర్తుకు వచ్చాయి. తెల్లవాడు పోయినా దేశంలో ఇంకా యీ అలజడి ఏమిటి? యీ బీదతనం, యీ ఆకలిచావులేమిటి? తెల్లవాళ్లుపోతే తమ భూమి తమకు వస్తుందన్నాడు సత్యనారాయణ. అది జరగలేదుకదా నానాటికీ, దొరికే తిండికూడా దొరక్కుండా పోతూంది. నిజంగా తెల్లవాడు దేశాన్ని వదలి వెళ్ళలేదేమో? వెళ్తున్నానని మోసంచేసి మారువేషంలో యీ దేశంలో తిష్టవేశాడేమో?—రంగన్న అదే పనిగా ఆలోచించ సాగాడు. దేశంలో జరిగిన రాజకీయ మార్పులు — "ట్రాన్సుఫర్ ఆఫ్ పవర్" లాటి విషయాలు రంగన్నకు అర్థం కావు గదా మరి!

ఒకరోజు రాత్రి రెండో ఝామున ఏదో అలికిడి జరిగి రంగన్నకు నిద్రాభంగ మైంది. నిద్రపట్టక పక్కలో అటూ ఇటూ మసలుతూ పడుకొని తనకు రెండు గజాల దూరంలో పడుకొన్న వాళ్ళ సంభాషణ శ్రద్ధగా వినసాగాడు.

"ఏంరా? మనం ఎంతకాలం యిట్లా తప్పించుకు తిరగ్గలం? ఇప్పటికే మనవాళ్ళు చాలామంది చనిపోయారు."

"నీకు వ్యతిరేకుల ప్రచారం బాగా తలకెక్కినట్టుగా వుంది. పత్రికలూ, రేడియోలు వాళ్ళ చేతులో వున్నాయి! యిష్టమొచ్చినట్టు ప్రచారం చేస్తున్నారు. మన వుద్యమం ఎంత

దెబ్బతిన్నదని ప్రచారంచేస్తే నిజానికి అంత బలపడుతూన్న దన్నమాట."

"ఏమో ఎందు కొచ్చినట్టు యీ అజ్ఞాతవాసం? నా కేం నమ్మకంలేదు—మనం ఎంతవరకు సాధించగలమో?"

"మన ఆశయాలమీద మనం విశ్వాసం వుంచాలి. అంతిమ విజయం మనదే! యీ సంఘాన్ని మనుషుల్ని మనం మార్చ గలం. చూడు, యీ కొట్ల అరుగులమీద ఎంతమంది వుంటా నికి నీడలేక, తింటానికి తిండిలేక అలమటిస్తోన్నారో? మనం సోషలిస్టు సమాజాన్ని నిర్మించుకోగలం. దీక్షతో ముందుకు సాగిపోవడమే మన కర్తవ్యం."

రంగన్నకు అ మాటలు వింటూంటే నిద్రమత్తు వదలి పోయింది. ఎవరు వీళ్లు? ఆ రోజు సత్యనారాయణా, కొడుకు సుబ్బయ్యాల్లా ఆశయాలూ, ఆదర్శాలు అంటూ ఉద్రేకంలో వున్నారు. కుర్రాళ్ళు—ఆలోచనా, ముందుచూపులేని వట్టి ఉద్రేకం! వీళ్ళూ తన సుబ్బయ్యలానే పోలీసుతుపాకులకు ఎప్పుడో మసయిపోతారు! "అమర వీరుల ఆత్మబలిదానం, రక్తప్రవాహంనుంచే స్వాతంత్ర్యమూ, స్వేచ్ఛా, నవసమా జమూ ఉద్భవిస్తాయి. లక్షలాది అభాగ్యులు దారిద్ర్యం, పీడన, ఆకలితో మరణిస్తోన్నారు. మనలో ఎక్కువమంది జీవితంలో సగం కాలం కూడా బతకటం లేదు. మానవుడు మరణించినా, మానవత్వం జీవిస్తుంది. మానవత్వం చిరంజీవి—అతడి గొంతు భావోద్రేకంతో పూడిపోయింది. రంగన్నకు ప్రాణం ఉక్కిరి బిక్కిరైనట్టయింది. తన్ను ఏదో కొత్తలోకాల్లోకి ఆ యువ కుడు తీసుకెళ్తున్నాడు—

రంగన్న కదలడం చూచి అజ్ఞాత వ్యక్తులిద్దరూ అదిరిపడి కూర్చున్నారు. కొంచం సేపాగి మళ్ళీ మెల్లగా గుసగుసా మాట్లాడటం మొదలు పెట్టారు. పిరికి తనంతో దిగజారి పోతూన్న వ్యక్తికి తాము నిర్మించబోయే నవసమాజంగురించీ, సమతా ధర్మాన్ని గురించీ చెప్తూ కొత్త ఆశయాల్ని చిగురింప చేస్తో ధైర్యాన్ని పురిగొల్పుతున్నాడు రెండవ వ్యక్తి. ముందు తరాలకోసం యీ తరంవాళ్ళు త్యాగంచేయక తప్పదనీ—ఇంకా, యింకా ఏవో సిద్ధాంతాలూ, తీర్మానాలూ, తాము తీసికొన్న ప్రతిజ్ఞలను జ్ఞాపకంచేస్తో ఎదటి వ్యక్తిలో నూతనోత్సాహాన్ని కలిగిస్తోన్నాడు.

చెవులప్పగించి వింటూన్న రంగన్న—

"చూడు బాబూ, ఇదంతా యీ దేశంలో జరిగే మాటేనా ?" అన్నాడు.

వాళ్ళ సంభాషణ ఠక్కున ఆగిపోయింది! ఓ క్షణం ఆగి—"చూస్తావుండు తాతా, ఆరునెల్లు, కాకపోతే సంవత్సరం!! కాకపోతే మరికొంత కాలం? అప్పుడు మీలాంటి ముసలాళ్ళు హాయిగా విశ్రాంతి భవనాల్లో కాలక్షేపం చేయొచ్చు!" అన్నాడు సిద్ధాంతాలను నెమరువేస్తో ఆశల్ను వెదజల్లుతూన్న వ్యక్తి.

"అంత పుణ్యమా—నాయనా ?" రంగన్న హృదయం పులకరించగా అన్నాడు.

"తెల్లవారితే ప్రమాదం—లే! వెళ్దాం!" అంటూ లేచాడు అతడు. రెండవవాడు పిల్లిలా అతణ్ణి అనుసరించాడు.

"వెళ్లొస్తాం తాతా!" అని రంగన్నకు చెప్పి ఇద్దరూ చీకటిలో మాయమైనారు.

వీళ్ళుకూడా ఏదో ప్రమాదంతో ఆడుకొంటూన్నట్టు తోచింది రంగన్నకు. "ఇదంతా ఇక్కడెట్లా జరుగుతుందబ్బా!"—అన్న జిజ్ఞాసలో పడిపోయాడు రంగన్న.

ఆరు నెలలు గడచినై—

సంవత్సరం గడిచిపోయింది—

కాని ఆ వ్యక్తులు మళ్ళీ రంగన్న కళ్లకు కన్పించలేదు!

పోనీవాళ్ళు చెప్పినట్టూ జరగలేదు—

పైగా పరిస్థితులు మరి అధ్వాన్నం అయినై. దేశంలో అన్నం తరుగైంది. దాతలు కరువైనారు. అడుక్కుంటే పెట్టే వారులేరు. చేయడానికి పనిలేదు.

ఎక్కడెక్కడ్నుంచో వేలాది జనం పొట్ట చేతపట్టుకొని తరలి వస్తోన్నారు. రాత్రిళ్ళు కొట్లమీదున్న విశాలమైన అరుగులమీద, పక్కనున్న ఖాళీస్థలంలో వీళ్ళ రద్దీ ఎక్కువయింది. ఆకలీ, అంటువ్యాధులూ, దానికి తగ్గట్టు కొత్తగా వచ్చి దిగిన వాళ్ళతో పాతవాళ్ళ దెబ్బలాటలూ, జానెడు నేలకోసం ఎన్నో ఘోరాలు జరుగుతున్నాయి! పనికోసం పోటాపోటీలూ, యీర్ష్యలూ, ద్వేషాలూ పాటక జనంలో క్రూరసర్పాల్లా బుసలు కొట్తూన్నాయి!

మృత్యువు నిర్దాక్షిణ్యంగా మనుషుల్ని మింగివేస్తోంది—

రంగన్న తన కళ్ళముందు జరుగూతూన్న యీ నరకాన్నుంచి రక్షించమని రెండు చేతులెత్తి మృత్యువుని ఆహ్వానించాడు. కాని చావు కోరినప్పుడల్లా వస్తుందా? దాన్నిచూసి పరుగెత్తే వాళ్లను తరిమి పట్టుకోవడం మృత్యువుకు సరదా ఏమో?

రంగన్న కుప్పకూలించిపోయి లేవలేని స్థితిలో వుండగా మెట్ట ప్రాంతాన్నుంచి వో ముఠావాళ్లు వరికోతలకు వచ్చి కొట్ల అరుగులమీద దిగారు. రంగన్న పక్కగా, ఆ ముఠాలో కలసివచ్చిన నర్సమ్మ, దాని మొగుడూ మకాంవేశారు. అలా అలా, నర్సమ్మకూ రంగన్న తాతకూ పరిచయం కలిగింది.

నర్సమ్మ మొగుడితో కలసి పగలల్లా పనిలోకి వెళ్లేది. రంగన్న వాళ్ళు పనిలోనుంచి వచ్చేవరకూ, వాళ్ళ అన్నపు కుండల్నీ, మూటల్నూ, యితర సామగ్రికి జాగ్రత్తగా కాపలా కాస్తో వుండేవాడు. బదులుగా నర్సమ్మ రాత్రిపూట రంగన్న తాతకు యింత నూకలసంకటి పోస్తోండేది.

అలా రెండు నెలలు గడచిపోయినై.

నర్సమ్మ ముఠావాళ్ళు తిరిగి తమ ప్రాంతానికి వెళ్ళడానికి ప్రయాణమైనారు.

ఆరోజు రాత్రి నర్సమ్మ రంగన్న తాతకు నూకలసంకటి పోశాక తమ ప్రయాణం సంగతి చెప్పింది.

ఇంకా రెండు ఝాముల పొద్దుందనగానే కొట్లమీద జనం లేచారు. ముంతా, కంచం మూట కట్టి నెత్తికేసుకొని నిద్రముఖాలున్న పిల్లల్ను భుజాన్నేసుకొని బయలుదేరారు.

నర్సమ్మ చివరిసారిగా రంగన్న తాతను శెలవడిగి బయలుదేరింది.

గుడ్డి వెన్నెల్లో నీడల్ను పరచుకొంటూ ప్రవాహంలా సాగిపోయారు కూలీలు. ఆ ప్రవాహంలో కలిసిపోతున్న నర్సమ్మను చూపు కందినంతవరకూ మౌనంగా చూస్తూ కూర్చున్నాడు రంగన్న తాత.

వేళకింత గంజి నోటికందించి ప్రాణాలు నిలిపిన నర్సమ్మ కూడా వెళ్ళిపోయింది. రేపట్నుంచీ తన గతేంకాను? మంచి నీళ్ళు యిచ్చే దిక్కుకూడా లేదు.

తను బతికి ఇంకేం సాధిస్తాడు? ఎవరికి వుపయోగపడ తాడు? దేనికోసం బతుకుతాడు? తన శరీరమే తన ప్రాణా లకు జైలు అయింది. తనకు యీ బంధిఖానానుంచి విముక్తి కావాలి? కరుణామయి అయిన మృత్యువు యికనైనా తన చల్లటి హస్తాన్ని నుదుటిపై వుంచరాదా? తన వళ్లోకి తీసుకొని జోకొట్టరాదా?

ఎవరికోసం రెక్కలు ముక్కలు చేసుకొని, కండలు కరి గించి, చేవగల జీవితం అంతా ధారపోసి సేవచేశాడో ఆ భద్ర య్యగారు యిప్పుడు లేడు. తను ఎన్నో ఆశలూ, కోరికలూ పెట్టుకొని పెంచిన కొడుకూ యీనాడు తనకు లేడు. తెల్ల వాడ్ని వెళ్ళగొట్టి స్వరాజ్యం తీసుకొచ్చి ప్రజల్ని సుఖపెడ్తా నన్న ఆ సత్యనారాయణ ఏడి? ఆనాటి రాత్రి ఆశయాలతో స్వర్గానికి మెట్లుకట్టి, మాటల్లో అమృతాన్ని చిందించిన ఆ సామ్యవాది ఏడి?

విశ్రాంతి భవనాలు వికలాంగులకూ, వృద్ధులకూ కట్టిస్తా నన్నావుగదరా నాయనా? ఏవిరా నీ విశ్రాంతి భవనాలూ విహార వాటికలూ? — రంగన్న తాత పెదవులపై విషాద పూరితమైన చిరునవ్వు చిందింది.

ఎన్ని కబుర్లు చెప్పావరా? మీ రెక్కడో కలలో చూసింది యీ భూమ్మీద జరుగుతుందని ఎలా అనుకున్నా రర్రా? — తాత హృదయంలో విషాదగీతి ఆలాపన ఆరంభ మైంది.

రంగన్న తాతకు గుండెల్లో కలుక్కుమన్నది. గుండె బరువెక్కి పోతూంది—ఆయాసం తరుముకొస్తోంది – హృదయ కోశం విచ్చిపోతున్నట్టయి వెల్లికిలా పడుకొన్నాడు.

భూతంలా నేలపాకిపోతూన్న చింతచెట్ల నీడ మాయ మవుతోంది. నీలి మబ్బులు చందమామను మింగివేశాయి. జమ్మిచెట్లచాటున స్మశానంలో మంటలు నాలికలు చాచుకొం టున్నాయి!

రంగన్నతాత మగతగా కళ్ళు మూశాడు. తాతకు తన శరీరం భూమిని బద్దలుకొట్టుకొని లోపలకు పోతూన్నట్టుగా వుంది....

హమ్మయ్యా—ఎన్నాళ్లకు ఆ చల్లని తల్లి, మృత్యుదేవ తకు తనపై కరుణకలిగింది! తన గుండెపై కొండ దొర్లుతోన్న బరువు! బరువు భారంతో తన హృదయం కృంగిపోతోంది! తన ఛాతీపై మృత్యువు కూర్చుంది!!

వాయువును కుంభించాడు; జీవ సమాధిలో ప్రవేశిస్తో న్నాడు! కొన్ని ఘడియల్లో కపాలమోక్షం అవుతుంది! ప్రాణ వాయువులు అనంత విశ్వంలో అంతర్లీన మవుతాయి. తనకు యీ ఐహిక బాధల్నుంచి శాశ్వత విముక్తి కలుగుతుంది. తను ఆశించగల ఆనందం అంతకంటే ఇంకే ముంది?

తన నాళాల్లో రక్తం గడ్డకట్టుకు పోతోంది. తెల్లటి వెలుగు తన్ను చుట్టివేస్తోంది. మృత్యుదేవత తన రొమ్ములపై కూర్చొని చేతులలో తన నుదురు నిమురుతోంది!

తన వక్షస్థలంపైన కూర్చున్న మృత్యువును రెండు చేతు లతో పొదివి పుచ్చుకొని హృదయానికి గాఢంగా హత్తుకొంటు

న్నాడు తను! పెదవులకు తన పెదవులు కలిపి బలంగా, ప్రేమగా ముద్దుపెట్టుకొంటున్నాడు తను...

కెవ్వున శిశువు ఏడ్చింది!!

రంగన్న పీడకల జారిపోయింది—

కళ్లుతెరచి చూశాడు. తన ఛాతిపై చేతులమధ్య పొదువుకొన్న పసిపాపడు రంగన్న కళ్ళల్లోకి చూశాడు!

తెల్లవారిపోతోంది. తూర్పు దిక్కున మసక చీకట్లపై కాంతిరేఖలు అలుముకొంటున్నాయి. అరుణోదయం అవుతూంది.

రంగన్న తాత లేచి కూర్చుని పసివాడి తల లాలింపుగా నిమిరాడు.

తెల్లవారుఝామున కూలీలంతా లేచి పోయారు. కన్న బిడ్డడ్ని పోషించలేని ఏ అభాగ్యురాలు యీ పసికందుని వదిలేసి పోయిందో అనుకొన్నాడు రంగన్నతాత.

తెలతెల వారుతుండగా చంటా డాడుకుంటూవచ్చి తన రొమ్ములపై కూర్చున్నాడు. దాంతో తనకు అకలా—అనుభూతీ—ఆరంభమైంది.

రంగన్న మరణాన్ని చుంబించా ననుకొన్నాడు—కాని పసివాణ్ణి—జీవితాన్నే ముద్దిడుకొన్నాడతను. పసిపాపడి కనుపాపల్లో లక్షలాది మానవులు—సుబ్బయ్యలూ, అజ్ఞాత వీరులూ దోబూచు లాడుతున్నట్టు తోచింది రంగన్న తాతకు.

అవును, మానవుడు చిరంజీవి.